www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 4 మార్చి 2024

5

పశ్చిమ గోదావరి



## 192 మందికి ఇళ్ల పట్టాలు

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

ఎంఎల్ఎ అంటే విజిటింగ్ కార్డు కాదని, నిరంతర శ్రామికుడని, అటువంటి శ్రామికుడు వంటి గ్రంధి శ్రీనివాస్ మనకు దొరకడం అదృష్టమని, వైసిపి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని మాజీ కౌన్సిలర్ కోడె యుగంధర్ అన్నారు. స్థానిక 18వ వార్డులో 192 మందికి ఆదివారం ఇళ్ల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందిస్తుందన్నారు. ఆపదలో ఉన్నవారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. నవ రత్నాలతోపాటు మరో 25 పథకాలను అదనంగా అందిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వర స్వామి ఆలయం మాజీ ఛైర్మన్ కోడే విజయలక్ష్మి, షేక్ ఎండి పాషా, గాదిరాజు రామరాజు, కోడె శ్రీధర్, కోడె సతీష్‌కుమార్, షేక్ సైనింసా, నీలపు వెంకట్, మాడుగుల దుర్గాప్రసాద్, వాలంటీర్లు పాల్గొన్నారు.

# సాగు చేసేదెంత.. రుణం ఇచ్చిందెంత..!



**కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో తీవ్ర అన్యాయం**
**రెండు జిల్లాల్లో 70 శాతానికిపైగా సాగు కౌలురైతుల చేతుల్లోనే**
**ఈ ఆర్థిక సంవత్సరంలోనూ అరకొర రుణాలే**
**రూ.పది వేల కోట్ల రుణ ప్రణాళికలో రూ.450 కోట్లులోపే రుణాలు**
**సాగు చేయని భూయజమానుల జేబుల్లోకే పంట రుణాల సొమ్ము**
**మూడు లక్షల మంది కౌలురైతుల గోడుపట్టని ప్రభుత్వం**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

కౌలురైతులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. సాగు చేసే కౌలురైతులకు కాకుండా భూయజమానులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేస్తుండటం గమనార్హం. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ రుణాల మంజూరులో ఇదే పరిస్థితి కొనసాగింది. కౌలురైతులు సాగు చేస్తున్న ఆయకట్టుకు, బ్యాంకులు మంజూరు చేసిన పంట రుణాలకు పొంతన లేకుండాపోయింది. వ్యవసాయ రుణ ప్రణాళికలో పంట రుణాల మంజూరుకు కేటాయించిన సొమ్ములో ఐదుశాతం సొమ్ము కూడా కౌలురైతులకు అందకుండాపోయింది. దీంతో కౌలురైతులు సాగు పెట్టుబడులకు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రాష్ట్రంలోనే అత్యధికంగా కౌలురైతులు ఉన్న జిల్లాల్లో ఏలూరు, పశ్చిమగోదావరి ఉన్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. రుణార్హత కార్డులు అందుకున్న రైతులు పట్టుమని లక్షా 30 వేల మంది కూడా లేరు. దాదాపు లక్షా 50 వేల మందికిపైగా కౌలురైతులకు రుణార్హత కార్డులే మంజూరు చేయని పరిస్థితి జిల్లాల్లో నెలకొంది. రెండు జిల్లాలో దాదాపు 15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. వరి, పామాయిల్, మొక్కజొన్న, పొగాకు వంటివి ప్రధాన పంటలుగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో సాగవుతున్న వ్యవసాయ భూమిలో 70 శాతానికిపైగా సాగు కౌలురైతులే చేస్తున్నారు. వ్యవసాయ సాగులో కీలక భూమిక పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మొత్తంగా లక్షా 30 వేల మంది కౌలురైతులకు మాత్రమే కౌలుకార్డులు మంజూరు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ కౌలురైతులకు మంజూరు చేసిన రుణం రూ.450 కోట్లులోపే ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో పశ్చిమగోదావరి జిల్లాలో రూ.350 కోట్లు వరకూ రుణాలిచ్చినట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో రూ.వందకోట్లులోపే కౌలురైతులకు పంటరుణాలు మంజూరైన పరిస్థితి ఉంది.

**పంట రుణాల ప్రణాళికకు.. చేతలకు పొంతన కరువు**

రెండు జిల్లాల్లో వ్యవసాయ రుణ ప్రణాళికల్లో పంట రుణాలకు దాదాపు రూ.పది వేల కోట్లు వరకూ కేటాయించిన పరిస్థితి ఉంది. 2024-25 రుణ ప్రణాళికలోనూ ఏలూరు జిల్లాలో పంట రుణాలకు రూ.6,306 కోట్లు కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నిబంధనల ప్రకారం పంట రుణాలు సాగుదారునికి మాత్రమే ఇవ్వాలి. భూయజమానికి పంటేతర రుణం అందించాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. సాగు చేయని భూయజమానికి పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. అధికారులు చెబుతున్న పంట రుణాల ప్రణాళికలో ఐదు శాతం సొమ్ము కూడా కౌలురైతులకు ఇవ్వడం లేదు. దీంతో కౌలురైతులు పెట్టుబడి కోసం ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇ-క్రాప్ బుకింగ్‌లో భూయజమానుల పేర్లు చేర్చి వారికే పంట రుణాలు ఇస్తున్నారు. దీంతో పంటలు దెబ్బతింటే పరిహారంగాని, బీమా సొమ్ము సైతం కౌలురైతులకు అందడం లేదు. ప్రభుత్వం ప్రతియేటా అందిస్తున్న రైతుభరోసా సొమ్ము సైతం భూయజమానుల జేబుల్లోకే వెళ్లిపోతున్నాయి. వైసిపి ప్రభుత్వం కౌలురైతుల పట్ల మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మేనిఫెస్టోలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు అంశంపై డిమాండ్**

వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా విన్పిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని చేర్చాలని కౌలురైతులు డిమాండ్ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో కౌలురైతులకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఇప్పుడు జనసేన టిడిపి పొత్తుతో ఎన్నికలకు వెళ్తోంది. ఈసారి మేనిఫెస్టోలోనూ ఈ అంశం చేర్చుతుందా.. లేదా అనే చర్చ సాగుతోంది. కౌలురైతులకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని వాస్తవ సాగుదారులు ఘంటాపథంగా చెబుతున్నారు.



ఆచంట-కోడేరు మార్గంలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

# మంచు.. మంట..!

**దట్టమైన పొగమంచుతో జనం అవస్థలు**
**పగలు ఎండ వేడిమికి బెంబేలు**

**ప్రజాశక్తి - ఆచంట**

వాతావరణంలో అనూహ్య మార్పులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పగటి వేళలో ప్రచండ భానుడు తన ప్రతాపాన్ని చూపించగా, రాత్రి సమయంలో దీనికి భిన్నంగా పొగమంచు కమ్ముకుని ఉదయం 8 గంటల వరకూ మంచుకురుస్తోంది. పగటి సమయాల్లో బయటికి రావడానికి ఉష్ణోగ్రతలు బెంబేలెత్తిస్తుండగా ఉదయం, రాత్రి సమయాల్లో మంచు ఇబ్బంది పెడుతోంది. పగటి ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉంటున్నాయో, రాత్రి సమయంలో అదే స్థాయిలో మంచు కురుస్తుండటం గమనార్హం. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని ఆచంట-కోడేరు రహదారిపై పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అదేరోజు మధ్యాహ్నం వేళల్లో భానుడు ప్రతిపానికి జనం విలవిల్లాడటం గమనార్హం.

# పల్స్ పోలియో విజయవంతం

## కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి - భీమవరం**




కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లాలో ఆదివారం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రారంభించిన పల్స్‌పోలియోపై స్థానిక కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులతో ఆయన మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తున్నారని, తద్వారా పిల్లలకు బంగారు జీవితం అందించిన వారమవుతామని అన్నారు. జిల్లాలో 1,85,953 మంది పిల్లలున్నారని గుర్తించి వారికి పోలియో చుక్కలు వేసే కార్యక్రమం చేపట్టారన్నారు. 20 మండలాలు, ఆరు మున్సిపాల్టీల పరిధిలో 5,260 మంది అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని వివరించారు. 1,315 పబ్లిక్ బూత్‌లు, 45 మొబైల్ బూత్‌లు, 34 ట్రాన్సిస్ట్ బూత్‌లను ఏర్పాటు చేసి 5,520 మంది వ్యాక్సినేటర్లను ఏర్పాటు చేశామన్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ, ఆర్‌టిసి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మురికివాడలు, ఇటుకబట్టీల వద్ద పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏదైనా కారణాల వల్ల పోలియో చుక్కలు వేయించని చిన్నారుల కోసం సోమ, మంగళవారాల్లో రెండు రోజులు మిగిలి ఉన్న ఇళ్లకు సంబంధించి ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు.



తణుకులో...



తాడేపల్లిగూడెంలో...

**తాడేపల్లిగూడెం:** పోలియో నిర్మూలనకు పల్స్‌పోలియో దోహదం చేస్తుందని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని దండగర్ర పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆయన పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ పోలియోరహిత సమాజం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేళ్లుగా పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నాయన్నారు. పోలియో నిర్మూలనకు చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మాధవరం పిహెచ్‌సి వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తణుకు:** చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ద్వారా వారికి నిండు జీవితాన్ని ఇచ్చినట్లేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బ్యాంక్ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేసి పల్స్‌పోలియో ప్రారంభించారు. ఈ సందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ బి.దుర్గామహేశ్వరరావు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్, అర్బన్ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం, డాక్టర్ ఎం.డానియల్‌రాజు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.


**నరసాపురం:** నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని పార్క్ రోడ్డులో కొప్పర్తి వేణుగోపాలరావు కాంప్లెక్స్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ పిల్లల జీవితాల సంపూర్ణ రక్షణకు పోలియో చుక్కలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**పాలకోడేరు:** పోలియోరహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులోని పల్స్ పోలియో బూత్‌ను డిఎంహెచ్ఒతోపాటు డిఐఒ దేవ సుధాలక్ష్మి, జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ భావన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ పల్స్ పోలియో నిర్వహణ తీరును అభినందించారు. మోగల్లులో ఇటుకల బట్టీలో పని చేస్తున్న కార్మికుల కుటుంబాల్లోని 38 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రంగంనాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజన్, డాక్టర్ లీల లక్ష్మి, సిహెచ్ఒ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఒపిఎస్ అమలుపై మేనిఫెస్టోలో పెట్టాలి

## ఎంఎల్ఎ నిమ్మలకు యుటిఎఫ్ వినతి

**ప్రజాశక్తి - పాలకొల్లు**



ఎంఎల్ఎ నిమ్మలకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఎన్నికల మేనిఫెస్టోలో కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే సదరు ఫైలుపై సంతకం పెడతామని స్పష్టమైన హామీ ఇవ్వాలని యుటిఎఫ్ నేతలు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల బలమైన ఆకాంక్షగా ఉన్న పాత పెన్షన్ విధానం అమలు అంశాన్ని పార్టీ మేనిఫెస్టో కమిటీ దృష్టికి, అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బలమైన ఆకాంక్షను తమ పార్టీ మేనిఫెస్టో కమిటీ దృష్టికి, పార్టీ అధినాయకత్వ దృష్టికి, టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్‌కూ యుటిఎఫ్ నేతలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జివిజి.రామానుజరావు, పిల్లి శ్రీనివాస్, నేతలు జి.ప్రకాశరావు, సిహెచ్.లక్ష్మణరావు, బి.రాజు, టి.గోపాలకృష్ణ, ఎ.మాధవరావు, వి.రవీంద్ర, టి.గోపాలకృష్ణంరాజు, అంగర రవి పాల్గొన్నారు.

# బిజెపిని గద్దె దించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

**ప్రజాశక్తి - ఆకివీడు**




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో బిజెపికి సహకరిస్తున్న పార్టీలను గద్దె దించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని దుంపగడపలో 'ఇంటింటికీ సిపిఎం' కార్యక్రమం నిర్వహిస్తూ రాజకీయ ప్రచారం, సాగించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా, రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన నిధులను విడుదల చేయకుండా, విభజన హామీలు అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా కుదేలు చేసిన బిజెపికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పల్లకి మోస్తున్నాయని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో దగాకోరు బిజెపిని, దానికి అంటకాగుతున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా నియంత పాలన సాగిస్తోందని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, ఉపాధి లేక మళ్లీ వలసలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయని, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం అన్ని కాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, షేక్ వలీ, బి.రాంబాబు, డి.రవితేజ, కె.శంకర్, ఎస్.సూరిబాబు, ఎస్.ఉదయకుమారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పెరగని వేతనాలు.. మారని జీవితాలు

**ఆర్‌టిసి గ్యారేజీ కార్మికుల ఆవేదన**
**ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కాని సమస్యలు**
**పట్టించుకోని అధికారులు, యాజమాన్యం**
**నేడు చలో విజయవాడ**




**ప్రజాశక్తి - నరసాపురం**

ఆర్‌టిసి బస్సు అంటే మనందరికీ గుర్తుకొచ్చేది డ్రైవర్, కండక్టర్. వీరితో పాటు నిత్యం రోడ్లపై ఆగిపోయే ఆర్‌టిసి బస్సులను మరమ్మతులు చేసే మెకానిక్‌లు గుర్తుకురారు. వీరందరూ నిత్యం గంటల కొద్ది బట్టలపై, శరీరంపై ఆయిల్ మరకలతో బస్సుల కింద ఉండి పని చేస్తుంటారు. నిత్యం ఎక్కడో చోట ఆగిపోయే బస్సులకు మరమ్మతులు చేసేందుకు వీరు ఆగమేఘాలపై వచ్చి బస్సును రిపేర్ చేసి వెళ్తుంటారు. బస్సు పరిస్థితి మారినా డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదు. చాలీచాలని జీతాలతో సంవత్సరాల కొద్ది జీవితాలను గడుపుతున్నారు. ఎప్పుడోకప్పుడు పర్మినెంట్ చేయకపోతారా అని ఎదురు చూస్తూ అదే ఆశతో మెకానిక్‌లు, అసిస్టెంట్ మెకానిక్‌లు ఉండిపోతున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా తమ జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, గ్యాస్, కరెంట్ బిల్లులు, కూరగాయల ధరలు, ఇంటి అద్దెలకు ఇచ్చే రూ.పది వేలు ఏ మూలకోస్తాయని వాపోతున్నారు. పదో తరగతి తర్వాత ఐటీఐ డీజిల్ మెకానిక్ చదివి ఆరు నెలలు అప్రంటీస్ చేసిన వారిని ఆర్‌టిసిలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులుగా చేర్చుకుంటారు. ఎపిఎస్‌ఆర్‌టిసిలో కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, ఇఎస్ఐ పిఎఫ్ అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనమైనప్పటికీ కార్మికుల జీతాలు పెరగలేదు. సర్క్యులర్ ప్రకారం కార్మికులకు రావాల్సిన జీతాలను, కార్మిక శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారు. ఆర్‌టిసిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లో వోల్వా బాయ్స్, అటెండర్, ట్రాఫిక్ గైడ్స్, బస్సులకు ఆయిల్ కొట్టేవాళ్లు, రిజర్వేషన్‌లో పని చేసేవారు, కార్గోలో పనిచేసే వారు, కోచ్ బిల్డర్, పెయింటర్స్, ఆఫీస్‌లో డిఇలు ఉన్నారు. గత 15 ఏళ్లుగా అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. ఉద్యోగ భద్రత, సెలవు లేకుండా కార్మికులు గొడ్డు చాకిరి చేస్తున్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి, కార్మిక హక్కుల సాధన కోసం ఈ నెల నాలుగో తేదీన విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం సమావేశం నిర్వహించాలని ఎపిపిటిడి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ నిర్ణయించింది. దీని ద్వారా ప్రభుత్వానికి తమ సమస్యను రాష్ట్ర స్థాయిలో తెలపాలని కార్మికులు నిర్ణయించుకున్నారు.

**ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లు**

- సర్క్యులర్ ప్రకారం జీతం ప్రతినెలా పదో తేదీ లోపు కార్మికుల ఖాతాలో జమ చేయాలి.
- ప్రతి ఆరు నెలలకోసారి డిఎ బకాయిలు అలవెన్స్ రూపంలో చెల్లించాలి.
- కార్మికులందరికీ లేబర్ హాలిడేస్ అమలు చేయాలి.
- ఇఎస్ఐలో కుటుంబ సభ్యులందరి పేర్లు నమోదు చేయించాలి. పిఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాలో జమవుతున్నదీ లేనిదీ కార్మికులకు ఏడాదికోసారి రశీదు ఇచ్చి తెలియజేయాలి.
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- థర్డ్ పార్టీ విధానాన్ని రద్దుచేసి సంస్థ ద్వారానే కార్మికులకు జీతాలు చెల్లించాలి.
- ఆన్‌కాల్ డ్రైవర్లకు కనీస సౌకర్యాలుకల్పించాలి.

**ఉద్యోగ భద్రత కల్పించాలి**
**కె.వెంకట్, అసిస్టెంట్ మెకానిక్,నరసాపురం**



కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసే కార్మికులను పర్మినెంట్ చేయాలి. జీతాలు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా శ్రమను గుర్తించి జీతాలు పెంచాలి.

**కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి**
**కె.రూపేష్, అసిస్టెంట్ మెకానిక్, నరసాపురం**



కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. ఇఎస్ఐ, లేబర్ హాలిడేస్, సాధారణ సెలవులు అమలు చేయాలి. రూ.పది వేలు వేతనం సరిపోవడం లేదు. పెరిగిన ధరలతో కుటుంబం నడవడం కష్టంగా ఉంది.

**థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలి**
**జె.చక్రవర్తి,అసిస్టెంట్ మెకానిక్, నరసాపురం**




రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలి. ఆర్‌టిసిలో థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి ఆర్‌టిసి సంస్థ నేరుగా జీతాలు ఇవ్వాలి. జీతాలను పెంచాలి. సమాన పనికి సమాన వేతనం అందించాలి.

**సమస్యలను పరిష్కరించాలి**
**నేతల చిట్టిబాబు, అసిస్టెంట్ మెకానిక్, నరసాపురం**



ఆర్టీసీ డిపోలో 10 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్న. ఇప్పటికైనా పర్మినెంట్ చేయాలి. ఎప్పటికైనా చేస్తారని ఎదురు చూస్తూ ఉన్నాను. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

**కార్మిక చట్టాలు అమలు చేయాలి**
**పొన్నాడ రాము, సిఐటియు నరసాపురం పట్టణ కార్యదర్శి**



ఆర్‌టిసిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేలు జీతం ఇవ్వాలి. కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. ఆర్‌టిసిలు పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం, యాజమాన్యం గాలికొదిలేసింది. ప్రభుత్వం కార్మిక సమస్యలను పరిష్కరించాలి.

# ఆకివీడులో భారీ చోరీ

## 30 కాసుల బంగారం అపహరణ

**ప్రజాశక్తి - ఆకివీడు**

స్థానిక హైస్కూల్ వద్ద జాతీయ రహదారిని ఆనుకున్న ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యజమాని సోదాబత్తుల బాలాజీ తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం సాయంత్రం వివాహానికి ద్వారకాతిరుమల వెళ్లారు. ఆదివారం ఉదయం 7, 8 గంటల మధ్యలో ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు బద్దలకొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు 30 కాసుల బంగారం పోయినట్లు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగబాబు తెలిపారు. వేలిముద్రల నిపుణులు సాయంత్రం వేలిముద్రలు సేకరించారు. ఇటీవల కాలంలో ఆ ప్రాంతంలో చోరీలు చోటు చేసుకోలేదు. ఆరు నెలల క్రితం వరకు ఆకివీడులో జరిగిన వరస చోరీలు ఇటీవల ఆగాయి. చాలాకాలం తర్వాత ఇప్పుడు ఈ దొంగతనం జరిగింది. వేసవి ప్రభావం వల్ల దొంగతనాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



వేలిముద్రలు సేకరిస్తున్న బృందం, పోలీసులు

## పాలకొల్లులో పోలీసుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్పి అజిత ఆదేశాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ఎం ప్రభుత్వ కళాశాలలో ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో అడిషనల్ ఎస్పి ఎటివి.రవికుమార్, భీమవరం రూరల్ సిఐ సత్యకిషోర్, భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు, భీమవరం సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది కలిసి ఒక జట్టుగా, నరసాపురం సబ్ డివిజన్ తరుపున పాలకొల్లు రూరల్ సిఐ కె.రజనీకుమార్, పాలకొల్లు టౌన్ ఎస్ఐ బాదం శ్రీను, పోడూరు ఎస్ఐ డి.రామ్‌కుమార్, నరసాపురం సబ్ డివిజన్ సిబ్బంది కలిసి మరో జట్టుగా మ్యాచ్ నిర్వహించారు. ఇరు టీమ్‌ల కెప్టెన్లను జట్టును అడిషనల్ ఎస్పి ఎటివి.రవికుమార్‌కు పరిచయం చేశారు. నిర్ణీత 15 ఓవర్ల మ్యాచ్‌లో నరసాపురం సబ్ డివిజన్ మొదటి బ్యాటింగ్ చేసి 102 రన్స్ చేసింది. తర్వాత భీమవరం సబ్ డివిజన్ బ్యాటింగ్ చేసి నిర్ణీత 15 ఓవర్లలో 96 స్కోర్ చేశారు. దీంతో భీమవరం జట్టుపై నరసాపురం జట్టు విజయం సాధించింది. జిల్లా సెట్ అదనపు ఎస్పి ఎటివి.రవికుమార్ భీమవరం తరపున ప్రాతినిధ్యం వహించారు. జట్టును గెలిపించేందుకు చివరి వరకు ప్రయత్నించి రెండో స్థానం పొందారు. నిత్యం విధులు నిర్వహించే పోలీసులకు అప్పుడప్పుడు విరామ సమయంలో క్రీడలు ఆడటం వల్ల వారికి పరిశ్రమ ఉత్తేజం, ఉల్లాసంతో విధులు ఇంకా బాగా నిర్వహిస్తారని ఎస్పి అన్నారు. గెలుపొందిన నరసాపురం జట్టును అభినందించారు.

## పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని దొంగరావిపాలెం గ్రామంలో మత్స్యకారుల కమ్యూనిటీ హాలు, రైతు భరోసా కేంద్రాన్ని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్‌ఎ వంకా రవీంద్రనాథ్, ఎంఎల్‌సి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదివారం ప్రారంభించారు. సిద్ధాంతం గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, నక్కవానిపాలెంలో గ్రామ సచివాలయం, చిన్నమల్లం గ్రామంలో గ్రామ సచివాలయం, సోమరాజు చెరువు గ్రామంలో పంచాయతీ భవనం (గ్రౌండ్ ఫ్లోర్), పెనుగొండ గ్రామంలో రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గోవర్ధన్ పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - నరసాపురం

రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు కొనియాడారు. పట్టణంలోని సీమ రోడ్డులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పేదవారికి పాత బట్టలు, కొత్త బట్టలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు హాజరై దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటరమణ, రైతు సంఘాల సభ్యులు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, తోట శ్రీనివాస్, సలా ది రామారావు, అందే కృష్ణవిజయకుమార్, చెన్నంశెట్టి నాగు, బి.వరలక్ష్మి పాల్గొన్నారు.



వివాహ రిసెప్షన్‌లో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

## నాగబాబు కుమారుని రిసెప్షన్‌కు మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అడబాల గార్డెన్స్ ఫంక్షన్ హాలులో వైసిపి నేత గుణ్ణం నాగబాబు కుమారుడు వివాహ రిసెప్షన్ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ రిసెప్షన్‌కు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు నూతన జంటను దీవించారు. మాజీ ఎంఎల్‌ఎ అల్లు వెంకట సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, చెల్లెం ఆనంద్‌ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, అడబాల వెంకటరమణ, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు నాయుడు, ఎఎంసి వైస్ ఛైర్మన్ డిటిడిసి బాబు, రైతు గౌరవ ఛైర్మన్ కోరాడ శ్రీను, జజ్జవరపు చిన్నబాబు, సొమాసెల రామ్మోహన్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, ముచ్చర్ల శ్రీరామ్, నడపన జగపతి, నడపన శ్రీనివాస్, బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

## కాశీపట్నం భూములు పాతపాడు వాసులకే చెందాలి

ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారావు

ప్రజాశక్తి - మొగల్తూరు

కాశీపట్నం భూములు కాశీపట్నం పాతపాడు గ్రామాల ప్రజలకే చెందాలని ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు మేడిద మాధవ కృష్ణారావు చెప్పారు. ఆదివారం మొగల్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశీపట్నం రెవెన్యూ పరిధిలోని భూమి అంతా జమిందార్ చెప్పుకున్న వ్యక్తులకు సంబంధం లేదంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ భూములపై నాటి ప్రభుత్వం వేసిన నాన్‌అక్విజిషన్ కమిటీ విచారణ చేసి ప్రభుత్వ భూమిగా ధృవీకరించిందన్నారు. విజయవాడ ట్రిబ్యునల్ ఆదేశాలతో 1978 నుంచి 82 వరకూ చేసిన విచారణలోనూ భూమిపై సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేవని సెటిల్‌మెంట్ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. 1973లో ఈ భూములు ప్రభుత్వ భూమిగా సెటిల్‌మెంట్ అధికారులు గ్రామంలో టాం టాం వేయించారన్నారు. 1947 ఆగస్టు ఒకటో తేదీ నాటికి భూమిపై గల రైతుల హక్కు ప్రకారం 1978 నుంచి 82 వరకు నిర్వహించిన విచారణలో రైతుల వద్ద గల హక్కులు చెల్లవని తీర్పు వచ్చిందని, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెంబర్-7 ప్రకారం ఇదే అంశం ఉందని చెప్పారు. నాటి విచారణలో లేని ఆధారాలు ఇప్పుడు ఎలా చెల్లుబాటు అయ్యాయని ఆయన ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే అధికార పార్టీ కాశీపట్నం భూసమస్య పరిష్కారం చేసినట్లు ఆధారాలు సక్రమంగా లేకున్నా పది మందికి పట్టాలిచ్చారన్నారు. అధికారులు సైతం ఒత్తిడి లోనై నిబంధనలు తుంగలో తొక్కి వ్యవహరిస్తున్నారన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న అధికారులపై న్యాయస్థానానికి వెళ్తున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు చీఫ్ విప్ పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

బాధిత కుటుంబాలను చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదివారం పరామర్శించారు. ఇటీవల పట్టణంలోని 31వ వార్డుకు చెందిన బళ్ల సీతామహాలక్ష్మి, 27వ వార్డుకు చెందిన బి.పున్నరావు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పరామర్శించారు. వారి కుటుంబంలో వ్యక్తులు ఇటీవల మృతి చెందారు.

## యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భక్త సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయం ఎదుట యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి దెండుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## నేరాలు - ఘోరాలు

### లారీ ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

లారీ ఢీకొని రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆకివీడుకు చెందిన కొట్టాడ లీలామనోహర్ కుమారుడు వాసుదేవ శ్రీహర్ష శరత్ (9) కాన్వెంట్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో సాయంత్రం సమయంలో ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. అనంతరం రైల్వేస్టేషన్ వైపు నుంచి గంగానమ్మపేట వైపు ఉన్న తన ఇంటికి వెళ్తున్న క్రమంలో సిద్ధాపురం రోడ్డు లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ కింద పడిన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు.



# పోలియో రహిత సమాజానికి సహకరించండి

## పల్స్ పోలియో సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డాక్టర్ బి.సాయిచంద్ర అధ్యక్షతన నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలోని పది సచివాలయాల్లో 30 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశారని, వీటి ద్వారా సుమారు మూడు వేల మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, ఎంపిటిసి సభ్యులు కునుకు రమాదేవి శ్రీనివాస్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు మంతెన సాయిల చ్చిరాజు, కాగిత బుజ్జి, యడవిల్లి వెంకటేశ్వరరావు, చెన్నంశెట్టి హరినాయుడు, గుండాబత్తుల సుబ్బారావు, బడుగు బాలాజీ, రాయి సతీష్, గళావిల్లి ధనుంజయ పాల్గొన్నారు.



పాలకోడేరులో...

**ఆచంట :** పోలియో రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి అన్నారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, కరుగోరుమిల్లి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, పెనుమంచిలి, అయోధ్య లంక, గ్రామాల పరిధిలో 94 శాతం పోలియో చుక్కలు వేసినట్లు ఆచంట వేమవరం ప్రాథమిక వైద్యాధికారిని సత్యవతి తెలిపారు. మొత్తం 36 బూత్‌ల్లో 150 మంది సిబ్బంది పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సూర్యకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, నేలపూడి బేబీరామ్మోహన్‌రావు, గణేశుల శేషవాణి సుబ్బారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**గణపవరం :** పోలియో మహమ్మారిని తరిమి కొట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని గణపవరం ఎంపిపి దండు వెంకటరామరాజు అన్నారు. పల్స్‌పోలియో సందర్భంగా ఆదివారం అర్థవరంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేయడానికి 32 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సంతోష్‌నాయుడు చెప్పారు. తమ ఆసుపత్రి పరిధిలో 3475 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 3341 మందికి వేసినట్లు తెలిపారు. గణపవరం ఎంపిపి పాఠశాల వద్ద సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, సచివాలయం వద్ద సర్పంచి మోర అలంకారం, సరిపెల్లి పంచాయతీ వద్ద సర్పంచి సిహెచ్.లక్ష్మీభవాని, కొత్తపల్లిలో సర్పంచి మద్దాల రత్నకుమారి, గణపవరం నాలుగో సచివాలయం వద్ద ఉపసర్పంచి దండు రాము, మూడో సచివాలయం వద్ద ఎంపిటిసి సభ్యులు బత్తి సీతామ హాలక్ష్మి, కొమ్మర పంచాయతీ వద్ద సర్పంచి కొండేటి వెంకట రత్నం పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు, హెచ్‌వి.పద్మజ, ఆరోగ్య కార్యక ర్తలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 2770 మందికి పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ కె.ప్రియాంక తెలిపారు. తమ ఆసుపత్రి పరిధిలో 2912 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2770 మందికి వేసినట్లు చెప్పారు. 27 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ జి.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది వి.అన్నారి, సుబ్బలక్ష్మి, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసాపురంలో...

**తాడేపల్లిగూడెం :** పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కొమ్ముగూడెం సర్పంచి తాడేపల్లి బేబి అన్నారు. కొమ్ముగూడెం గ్రామ సచివాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచి తాడేపల్లి బేబి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి పిల్లల సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు పోలియో చుక్కలు వేయించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, టిడిపి నాయకులు తాడేపల్లి శ్రీను, ఆశావర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

**మొగల్తూరు :** పోలియో నిర్మూలన చుక్కల మందుతోనే సాధ్యమని, ప్రతిఒక్కరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలియో చుక్కల కేంద్రాలను ఆయా గ్రామ సర్పంచులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు, పిహెచ్‌సి వైద్యులు దినేష్‌కుమార్ మాట్లాడారు.



ఉండిలో...

మండలంలోని 5,531 మంది చిన్నారులకు 5,397 మందికి 52 పోలింగ్ కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు లక్ష్మీపార్వతి, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**పెనుగొండ :** స్థానికంగా ఏర్పాటు పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు వైద్యాధికారులతో కలిసి సర్పంచి శ్యామలసోనీ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు పోలియో బారిన పడకూడదనే ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, వైద్య అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాలకొల్లు :** పట్టణంలో రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కెవి.కృష్ణవర్మ సహకారంతో పాలకొల్లులోని 31 పోలియో సెంటర్లలో 150 మంది సిబ్బందికి భోజనం ప్యాకెట్లు అందించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, 27వ వార్డులో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్, క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, మాజీ ప్రెసిడెంట్లు చందక రాము, మద్దాల వాసు, క్లబ్ సభ్యులు గన్నాబతుల శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, పోతాబతుల సత్యనారాయణ, డాక్టర్ భావన, పోలియో అర్బన్ నోడల్ అధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, సబ్ నోడల్ ఆఫీసర్ జక్కంపూడి రామప్రసాద్, మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, డాక్టర్ హేనా పాల్గొన్నారు.

# నాటక రంగాన్ని ఆదరించాలి

## టిటిడి సభ్యులు మేకా శేషుబాబు

### పాలకొల్లులో జాతీయస్థాయి నాటిక పోటీలు ప్రారంభం






మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - పాలకొల్లు

గతంలో నాటక రంగానికి మంచి ఆదరణ ఉండేదని, సినిమా, టివిల ప్రాబల్యంతో ఆదరణ తగ్గిందని టిటిడి సభ్యులు మేకా శేషుబాబు చెప్పారు. పాలకొల్లు అద్దేపల్లి గంగరాజు సత్రంలో 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొల్లులో అనేక నాటక పరిషత్‌లు గత 60 సంవత్సరాలుగా నాటక రంగానికి ప్రోత్సాహం ఇస్తున్నాయన్నారు. పాలకొల్లు కళాభిమానులు ధన్యులని చెప్పారు. డాక్టర్ దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం వంటి కళాకారులు నాటకరంగం నుంచి వెళ్లిన వారేనన్నారు. చైతన్య భారతి కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం నాటికతో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సభలో మాజీ ఎంఎల్‌ఎ అల్లు వెంకట సత్యనారాయణ, వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, యడ్ల తాతాజీ, డిటిడిసి బాబు, సాలా నర్సయ్య, చిట్టూరి ఏడుకొండలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ, గౌరవ అధ్యక్షులు మేడికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ, కార్యదర్శి జక్కంపూడి కుమార్, విటాకుల రమణ, రెడ్డి వాసు, కొణిజేటి గుప్త పాల్గొన్నారు.

# సర్పంచి సుబ్బారావు సేవలు అభినందనీయం

## మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్నప్రసాద్



సర్పంచి సుబ్బారావు నిర్మించిన ఇంటి వద్ద మాజీ ఎంపిపి వెంకటరత్నప్రసాద్

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని దొడ్డనపూడిలో 2021 పంచాయతీ ఎన్నికల్లో తనకు ఓట్లేసి గెలిపించిన గ్రామంలోని పేద ప్రజలకు సేవలందించడంతోపాటు, నిలువ నీడలేని నిరుపేద కుటుంబాలకు సొంత నిధులతో ఇంటిని నిర్మించి ఆదుకున్న సర్పంచి సుబ్బారావు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్నప్రసాద్(తాతాపండు) అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో సర్పంచి కొల్లి సుబ్బారావు భాస్విని ఛారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్మించిన నూతన ఇంటిని ఆదివారం సర్పంచితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి సుబ్బారావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన నవుడూరి దుర్గారావు తండ్రి చనిపోవడంతో తల్లి సరోజినితో కలిసి శిథిలావస్థకు చేరిన తాటాకింట్లో నివాసం ఉంటున్నట్లు గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆ కుటుంబం పేదరికాన్ని చూసి తన భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు రూ.4.15 లక్షలతో ఇల్లు నిర్మించడంతోపాటు విద్యుత్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ సేవాతత్పరుడు మంచి మనసున్న సర్పంచి సుబ్బారావు ఇంటిని నిర్మించడం అభినందనీయమన్నారు. సర్పంచి సుబ్బారావును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కందులపాటి వీరరాఘవులు, దేశంశెట్టి మధుసూదనరావు, ఆరేటి కృష్ణ, కొల్లి శ్రీనివాసు, కుంకట్ల శ్రీనివాస్, ఆరేటి పద్మారావు, లక్ష్మణస్వామి, పలువురు వార్డు సభ్యులు, జనసేన, టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రామేశ్వరస్వామి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఆచంట

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆచంట రామేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ పరిసరాలు చలువ పందిళ్లతో అలంకరించారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీ శుక్రవారం రామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి దర్శనంలో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించారు. స్వామివారి ఆలయంతో పాటు స్థానిక కచేరి సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఆచంట, కోడేరు రహదారి వెంబడి రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి రామచంద్రకుమార్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉదయం స్వామివారికి పూజలు, మధ్యాహ్నం రెండు గంటలకు జీ తెలుగు సింగర్స్‌తో స్వర మౌనిక ఆర్కెస్ట్రా, రాత్రి ఎనిమిది గంటలకు తణుకు రాజమండ్రి కామినేషన్‌తో రాక్ స్టైల్ డాన్స్ ఈవెంట్, తొమ్మిది గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిఆపరు. 7వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఆకాష్ ఆర్కెస్ట్రా సినీ సంగీత విభావరి, ఎనిమిది గంటలకు స్వామి వారి గ్రామోత్సవం, 8:30 గంటలకు మధు ఈవెంట్స్ ఆర్కెస్ట్రా, ఎనిమిదో తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రథోత్సవం, ఏడు గంటలకు సత్య హరిచంద్రనాటకం, 9వ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు వసంత ఆర్కెస్ట్రా, అనంతరం గ్రామోత్సవం, రాత్రి తొమ్మిది గంటలకు కూచిపూడి భరతనాట్యం, పదో తేదీ ఆదివారం స్వామి వారి గ్రామోత్సవం, మధ్యాహ్నం రెండు గంటలకు మనోజ్ ఆర్కెస్ట్రా సినీ సంగీత విభావరి, అనంతరం సాయంత్రం ఏడు గంటలకు కుంకుమ బర్నెల్లు పంపిణీ కార్యక్రమం, ఎనిమిది గంటలకు తణుకు వారిచే సూర్య భాయ్ డాన్స్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఆలయంతో పాటు తిరనాళ్లు జరిగే ప్రదేశం, అన్నదాన సత్రంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా అన్నదాన కమిటీ వారు తాత్కాలికంగా తాటి ఆకులతో చలువ పందిళ్లు వేశారు. ఐదు రోజులపాటు అన్నదానం నిర్వహించడానికి అన్నదాన కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో కూడా యాత్రికులకు ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

# సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తన వల్ల ప్రజలకు మేలు జరిగితేనే తనకు ఓటు వేయాలని సిఎం జగన్ ధైర్యంగా ప్రజలను అడుగుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొవ్వాడ అన్నవరంలో సుమారు రూ.రెండు కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. రూ.16.20 లక్షలతో సోడ దాసి దేవదానం ఇంటి నుంచి ఆర్అండ్‌బి రోడ్డు వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.మూడు లక్షలతో పుచ్చకాయల యాకోబు ఇంటి నుంచి పండిట్ దావీదు ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్డును, రూ.50 లక్షలతో కాటూరి ప్రభుదాసు ఇంటి నుంచి వెల్లెటూరు శ్మశానం వరకు నిర్మించిన సీసీ రోడ్డును, రూ.13.50 లక్షలతో అల్లూరి దుర్గరాజు ఇంటి నుంచి పెనుకుదురు నాగరాజు ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్డును, రూ.12 లక్షలతో రేవుల గడ్డ చంద్రపాల్ ఇంటి నుంచి కోన అవ్వమ్మ ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్డును, రూ.40 లక్షలతో వెలువర్తి ముసలయ్య స్థలం నుంచి రజకుల శ్మశానం వరకు నిర్మించిన సీసీ రోడ్డును, రూ.18.50 లక్షలతో నడిపూడి పాపారావు ఇంటి నుంచి పడాల రామకృష్ణ ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్డును, రూ.27.75 లక్షలతో పశువుల ఆసుపత్రి నుంచి జెడ్‌పి హైస్కూల్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఎంఎల్ఎ గ్రంధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో, పట్టణంలో ప్రతి వార్డులోనూ పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు.


24వ వార్డులోని యుపిహెచ్‌సి స్కూలులో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పాల్గొని చంటి పిల్లలకు పోలియో చుక్కలను వేశారు.

**పేదవారు ఆర్థికంగా బలోపేతం కావాలి**

పేదల వద్ద డబ్బుంటేనే కొనుగోలు శక్తి వస్తుందని తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 34వ వార్డుకు చెందిన సుమారు 50 మంది టిడిపికి చెందిన రజకులు ఎంఎల్ఎ గ్రంధి సమక్షంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో వైసిపిలో చేరారు. వారిని సాదారంగా పార్టీలోకి ఆహ్వానించిన గ్రంధి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. తాను మొదటిసారి ఎంఎల్ఎగా పని చేస్తున్న సమయంలో ఆనాడు రజకుల సంక్షేమానికి తన వంతు కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, రెండో పట్టణ జెసిఎ కన్వీనర్ ఎఎస్.రాజు, సుబ్బరాజు, చంద్రిక మూర్తి పాల్గొన్నారు.

**వైసిపిలోకి జనసైనికులు**

జనసేనకు కీలకంగా ఉన్న గునుపూడికి సంబంధించిన పలు వార్డులతో పాటుగా ఇతర వార్డుల నుంచి జన సైనికులు ఆదివారం రాత్రి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో వైసిపిలోకి చేరారు. వారిని ఎంఎల్ఎ గ్రంధి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, కత్రెడ్డి సీతారామయ్య పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న సతీష్

## ఆపన్నులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

మానవ సేవే మాధవ సేవ అని, కష్టాల్లో ఉన్న వారికి సాయం అందించాలని ప్రముఖ వ్యాపారవేత్త మేకల సతీష్ అన్నారు. మండలంలోని తూర్పుతాళ్లు గ్రామం సైపువారిమెరకలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆకుల సత్యనారాయణ నివాసం ఉంటున్న తాటాకిల్లు దగ్ధమైంది. బాధితుడైన ఆకుల సత్యనారాయణను ఆదివారం మేకల సతీష్ పరామర్శించి తనవంతు సాయంగా రూ.10 వేలు నగదును అందించారు. మరికొంతమంది దాతలు దాతృత్వాన్ని ప్రదర్శించి ఆకుల సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని సతీష్ కోరారు.

## హామీల అమలు ఘనత జగన్‌దే

ప్రజాశక్తి - నరసాపురం

పేదల సొంతింటి కల నెరవేరుతుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని లిఖితపూడి గ్రామంలో రూ.47.3 లక్షలతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంకు, తాగునీటి సరఫరా అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ 99 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. ఐదేళ్లలో ఒక లిఖితపూడి గ్రామంలో రూ:13 కోట్లు సంక్షేమం కోసం, రూ.3 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో శివారు ప్రాంతం వరకు స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందించి, రోడ్లు అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అర్హులైన 65 మందికి జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, ఎంపిపి సోని, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపిటిసి సభ్యులు చిన్నం వెంకట్రావు, చొప్పల జ్ఞానప్రకాష్, పితాని మురళి, చిట్టిబాబు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధే సిఎం జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యమని ఎంఎల్‌సి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని కవిటం గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన సచివాలయం-1, 2 భవనాలను, రైతు భరోసా కేంద్రం-1, 2 భవనాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం, వాలంటీర్ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని సిఎం జగన్ తీసుకొచ్చారన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, గ్రామ సర్పంచి చుట్టుగుళ్ల పూర్ణిమ, సొసైటీ ఛైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ పడాల సత్యనారాయణ రెడ్డి, అంబళ్ల భాస్కరరావు, సత్తి మురళీకృష్ణరెడ్డి, ఎంపిటిసి సభ్యులు కుక్కల సూరిబాబు, ఉప సర్పంచి పోతంశెట్టి సూర్యనారాయణరెడ్డి, ఎపి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు పాల్గొన్నారు.